# 12. రచయిత

ఎన్నిసార్లు ప్రయత్నించినా తనతో జవాబు చెప్పించి మళ్ళీచెట్టె క్కుతున్న భేతాళున్ని స్వాధీనం చేసుకోవడానికి విసుగుచెందకుండా ప్రయత్నించే విక్రమార్కుడిలా చెట్టు దగ్గరి కొచ్చాడు రమణశ్రీ— చెట్టెక్కి శవాన్ని భుజంపై వేసుకొని చెట్టుదిగి శ్మశానం దిక్కు నడవ సాగాడు—అతన్ని మాట్లాడించాలని శవంలోని భేతాళుడతనితో

"ఓ మనీషీ! జేబులోనున్న కాగితం, కలం, నీ ముఖకవలికలను బట్టి నువ్వు నిరంతరం సాహితీవ్యాసంగంలో మునిగి తేలుతున్నవాడివని అర్థంచేసుకున్నాను — అయితే భుజంపై పట్టుశాలువా, కాళ్ళకు గండ పెండేరాల్లాంటివి లేవు కాబట్టి నువ్వు సాంప్రదాయకవివికావు—గిరజాల జుట్టు, మల్లెపూవులాంటి బట్టలు లేవు కాబట్టి భావకవివీకావు — ఆహాం భావ కవివంతకంటే కావు— నీవు అభ్యుదయ కవివో, ప్రజాకవివో, విప్లవకవివో అయ్యుంటావు—నువ్వు రచనలు బాగానే చేసినా ఏ సన్మా నాల జోలికెళ్ళిన వాడిలా కనబడటంలేదు —నీ కోరికేంటో చెప్పు....!" అన్నాడు

"ఈ భేతాళుడు భలే గడుసువాడిలా వున్నాడు — నన్ను కొండె క్కించి మాట్లాడాలని ప్రయత్నిస్తున్నాడు—అతడెంత ప్రయత్నించిన అసలే మాట్లాడవద్దు—, దృఢనిర్ణయం తీసుకొని గబగబా నడుస్తున్నాడు రమణశ్రీ....

నీ దృఢదీక్ష చూస్తుంటే నువ్వనుకున్న దేనాటికైనా సాధించేవాడిలా కనబడుతున్నావు... నీకు మార్గాయాసం తెలియకుండా చేయడానికో కథ చెబుతాను విను...." అని కథ చెప్పసాగాడు—

సుమన్ కవి...రచయిత—అయితే తాను కవినని, రచయితనన్ని ఎప్పుడూ గర్వపడలేదు — అతడు రచనలు చేయడమే తపస్సుగా భావించి నిరంతరం కృషి చేస్తున్నాడు ... రాత్రింబవళ్ళు అతడు తాను రాసేదాన్ని గురించే ఆలోచించడం ఆలోచించేదాన్నే కాగితంపై పెట్టడం చేస్తుంటాడు—అతడు రాస్తున్నది డబ్బుకోసం మాత్రంకాదు — కేవలం పేరు కోసమూకాదు—సాహిత్యానికి సామాజిక ప్రయోజనముండాలని అతడు మనస్ఫూర్తిగా భావించాడు ....మంత్రాలకు చింతకాయలు రాలనట్టు సాహిత్యం వల్లనే సమాజం మారకున్నా-సమాజం మార్పులో సాహిత్యానికి పాత్రవుంటుందని అతని ధృఢ విశ్వాసం— ఈ విషయాన్ని దృష్టిలో పెట్టుకునే అతననేక రచనలు చేశాడు... వరకట్న దురాచారాల గూర్చి కట్నాల అంగట్లో యువకులు సిగ్గువిడిచి అమ్ముడు పోవడం గూర్చి కథలు, కవితలు రాసాడు — స్త్రీలపై జరుగుతున్న అత్యాచారాలను, అన్యాయాలను వెలికితీస్తూ రచనలు చేసాడు – సంఘంలోని కుళ్ళును బట్టబయలు చేస్తూ కుండబద్దలు కొట్టినట్టు రాసాడు— ఆతని రచనలు వాస్తవికతకు దగ్గరగానూ, సమాజానికుపయోగపడేవిగానూ ఉంటాయి....

ఆంధ్రదేశంలోని చాలా పత్రికలాతని రచనల్ని ప్రచురించాయి— అయితే ఆ పత్రికలన్నీ ఓ ధృక్పథంతో సాహితీసేవ చేస్తున్నవే!— అవేవీ పారితోషికాన్నిచ్చే పత్రికలుకావు—పెద్దగా సర్క్యులేషనున్న పత్రికలూకావు-అందువల్ల అతడెన్ని రచనలు చేసినా కనీసం స్టాంపుల ఖర్చుకైనా డబ్బురాలేదు-అందువల్ల ఇంట్లో భార్యపిల్లలు మొదలుకొని బంధు-మిత్రులంతా అతని రచనలు దండగని అనసాగారు— రాయడం మానుకొమ్మని ఉచిత సలహా ఇచ్చారు-పెద్దపత్రికల్లో అంటే పారితోషికం చెల్లించే పత్రికల్లో అచ్చయితేనే నిజంగా రచయితవని చెప్పిపొడి

వారు–కొందరు హితైషులు ఆపత్రికలకూ పంపమని ప్రోత్సహించారు–ఒత్తిడి చేసారు—

బాగా ఆలోచించాడు సుమన్—తన ఉద్దేశ్యాలకు భంగం కలుగకుండా ఆ పత్రికలకూ రచనలు పంపాలని నిర్ణయించుకున్నాడు – వాటికీ పంపడం ప్రారంభించాడు–కొందరసూయపరులు అతన్ని క్రిందకులాగడానికి ప్రయత్నించినా, మిత్రులే ద్రోహంచేయ తలపెట్టినా నిరుత్సాహపడకుండా పత్రికలకు రచనలు పంపుతూనే వున్నాడు— నిర్విరామంగా తన సాహితీ తపస్సును కొనసాగిస్తున్నాడు—అయితే కొన్ని పత్రికలకు పంపిన రచనలు ఎన్నినెలలు గడిచినా, స్టాంపులంటించిన కవర్లు పంపినా తిరిగికూడా రావడంలేదు–ఎన్నిసార్లు ఉత్తరాలు రాసినా ఫలితం శూన్యం—మరికొన్ని పత్రికలకు పంపిన రచనలు ముట్టిజూచిన దాఖలాలు కూడా లేకుండా తిరిగొచ్చాయి— ఒకటి రెండు పత్రికల్లో కొన్ని రచనలు అచ్చయినా అతడందువల్ల బావుకున్నదేంలేదు —ఒక్కోసారి నిరుత్సాహంచెంది శాశ్వతంగా కలాన్ని వదిలిపెట్టాలని కూడా ఆలోచించాడు— మళ్ళీ తానే అది సరైందికాదని తన ప్రయత్నాలను కొనసాగిస్తూనే వున్నాడు —

కథ చెప్పడం ఆపాడు భేతాళుడు...

“సాహితీసేవ చేస్తున్న పత్రికలచే మంచి రచయితగా లెక్కింపబడిన సుమన్ రచనలను పెద్ద పత్రికలెందుకు ప్రచురించలేదు— విసుగుచెందిన సుమన్ ఏం నిర్ణయం తీసుకొనుంటాడు–? అతడు తన ప్రయత్నంలో సఫలీకృతుడవుతాడా—?

ఈ ప్రశ్నలకు జవాబులు తెలిసీ చెప్పకపోయావో నీ రచనలు తిరిగి కూడా రాకుండా శపిస్తాను—” అన్నాడు భేతాళుడు—

"అమ్మబాబోయ్ ఒక్కోకథను తిరిగి రాయాలంటే ఎంతోకష్టం– రచయిత కింతకంటే పనిష్మెంట్ లేదు—, తనలో తాననుకొని జవాబులు చెప్పసాగాడు రమణశ్రీ—

"సుమన్ మంచి రచయిత–నిజమే–సామాజిక మార్పును కోరుతూ వాస్తవికతకు దగ్గరుండే రచనలు చేసాడు ... అదీనిజమే—
కాని, పెద్దపత్రికలని చెప్పబడేవి వ్యాపారం కొరకు పెట్టుకున్నవి—" లాభాలకొరకు పెట్టుకున్నవి...వాటికి కావాల్సింది సర్క్యులేషన్ పెరగడంకాని మంచి రచనలో, వాస్తవిక రచనలో ప్రచురించడంకాదు— ఊహించని ముగింపులు, మ్యాజిక్కులు, తళతళలు, మిలమిలలు— సెన్సేషన్ రేపే విషయాలు ప్రచురించి సర్క్యులేషన్ పెంచుకుంటారు — అడపాదడపా కొన్ని మంచి రచనలు ప్రచురింపబడ్డా సుమన్ రచనలకు చోటు దొరికింది తక్కువ— పేరునుచూసే రచననేమాత్రం చదువకుండానే ఎన్నో రచనలు తిప్పి పంపబడినా ఆశ్చర్యంలేదు—

పత్రికల వైఖరితో విసుగుచెందినా మొండి పట్టుదలకలవాడు కాబట్టి సుమన్ తన ప్రయత్నాలను కొనసాగిస్తూనే వుంటాడు—

సుమన్‌కు ఎన్ని అడ్డంకులు ఎదురైనా ఎదుర్కొనే మనోధైర్యం ఎంత కాలమైనా తన ప్రయత్నంలో సఫలీకృతుడవడానికి ఎదిరిచూసే సహనం ఉన్నాయి—కాబట్టి తప్పకుండా విజయం పొందుతాడు...తిప్పి పంపిన పత్రికల వాళ్ళతోనే శహబాష్ అనిపించుకుంటాడు–అయితే ఈ ప్రయత్నంవల్ల సుమన్ పట్టుదల నెగ్గుతుందేమోకాని అతనికేదోఒరుగుతుందనుకోను—"

రమణశ్రీ మౌనభంగం కాగానే శవంతోసహా మాయమై మళ్ళీ చెట్టెక్కాడు భేతాళుడు

[జీవగడ్డ జూన్ 1986]